సాక్షి
కర్నూలు
బుధవారం : 15 : మార్చి : 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలు వీరభద్ర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం విశాఖపట్నంకు చెందిన రవిప్రసాద్ రూ.లక్ష విరాళమిచ్చారు. దాతకు స్వామివార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	21.2
గరిష్టం	38.6

న్యూస్‌రీల్

కౌంటింగ్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్) : స్థానిక సంస్థల కౌంటింగ్‌లో పొరపాట్లకు తావులేకుండా చూడాలని ఆర్‌ఓ, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఉద్యానభవన్‌లో స్థానిక సంస్థల కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి అభ్యర్థి టేబుల్‌కు ఒకరు చొప్పున ఏజెంట్‌ను పెట్టుకోవచ్చన్నారు. రెండు టేబుళ్ల..మూడు రౌండ్లలో ఫలితాలను ప్రకటిస్తామని చెప్పారు. అయితే, కౌంటింగ్ కేంద్రంలోకి పెన్నులు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో మొదట పోస్టల్ బ్యాలెట్లు, అనంతరం బ్యాలెట్ పేపర్లను కలిపి తరువాత అభ్యర్థుల వారీగా లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రైనర్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి శిక్షణ ఇచ్చారు.

ఉచిత స్పర్శ దర్శనం కల్పించండి



మహాస్వామికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): ఉగాది పండుగను పురస్కరించుకుని భక్తులకు శ్రీశైలంలో స్వామి ఉచిత స్పర్శ దర్శనం కల్పించాలని జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం నేతలు కోరారు. నగర శివారులోని నందికొట్కూరు రోడ్డులో కర్ణాటక నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తుల కోసం సంఘం ఆధ్వర్యంలో ఉచిత అన్నప్రసాద వితరణ, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ క్యాంప్‌నకు వచ్చిన శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధరామ పండితారాధ్య మహాస్వామిని సంఘం రాష్ట్ర నాయకులు జేపీ మల్లికార్జునయ్య, శ్రీశైల ట్రస్ట్‌బోర్డు సభ్యులు మఠం విరుపాక్షయ్య స్వామి తదితరులు కలిసి వినతి పత్రం అందించారు. స్పర్శ దర్శనానికి రూ.500 చెల్లించాలని నిబంధన పెట్టడం సరికాదన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు 68 కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పరీక్షలకు ఉదయం 7,974 మంది విద్యార్థులకు గాను 7342 మంది, మధ్యాహ్నం 12,116 మందికి గాను 10,997 మంది హాజరయ్యారు. పరీక్షల్లో కాపీయింగ్‌కి పాల్పడిన 11 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

కొత్తగా రెక్కలొచ్చైనా!

అవకాశాల వేటలో వడివడి అడుగులు

లక్ష్యం దిశగా అడుగులు



ఈమె పేరు తులసి. కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన నాగరాజు, మల్లమ్మ దంపతుల రెండో కుమార్తె. ఏడాది వయసులో పోలియో సోకడంతో రెండు కాళ్లు చచ్చుపడ్డాయి. బీఎస్సీ పూర్తి చేసిన తులసి ప్రస్తుతం వలంటీర్‌గా సేవలందిస్తోంది. కనీసం నడవలేని స్థితిలోనూ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్న ఈమెకు మూడు చక్రాల స్కూటీ సాయంగా నిలుస్తోంది. ఎవరి తోడు లేకుండా వెళ్లి వచ్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సైతం తులసి సిద్ధమవుతోంది.

జీవితమే ఓ పోరాటం



ఇతని పేరు శివ. తుగ్గలి మండలం రామలింగాయపల్లికి చెందిన రామలింగడు, లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు. పుట్టుకతోనే పోలియో సోకింది. ఏడో తరగతి చదువుతున్న సమయంలో తండ్రిని క్యాన్సర్ కబళించడంతో తల్లికి ఆసరాగా కూరగాయలు విక్రయించడం మొదలుపెట్టాడు. ఇంతలో తల్లికి కూడా క్యాన్సర్ సోకడంతో ఆమె చికిత్స కోసం కర్నూలుకు చేరుకున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకునేందుకు ప్రస్తుతం జొమాటో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు.


పరీక్షకు ఎదురొడ్డి..



ఈమె పేరు కె.కృష్ణవేణి. నందవరం మండలం రాయచోటి గ్రామానికి చెందిన కె.నరసింహారెడ్డి, సుజాత దంపతుల కుమార్తె. రెండేళ్ల వయసులో కుడి కాలికి పోలియో సోకింది. కాస్త దూరం నడవాలన్నా కష్టం. అయినా ఎంబీఏ పూర్తి చేసింది. ప్రస్తుతం గురజాల సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. సొంతంగా కారు నడపటం నేర్చుకుని విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తోంది. గత ఏడాది సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ జి.విష్ణువర్ధన్‌రెడ్డితో వివాహం కాగా.. జీవితం సాఫీగా సాగుతోంది.

- తోడుగా సాంకేతిక పరిజ్ఞానం
- మూడు చక్రాల స్కూటీతో మారిన జీవనం
- డ్రైవింగ్‌కు అనువైన మార్పులతో అందుబాటులో కార్లు
- విభిన్న రంగాల్లో రాణింపు





ఇది పోటీ ప్రపంచం. జీవితంలో ఎవరు ఎంత బాగా పరిగెడితే.. విజయం అంత సులువుగా దాసోహమవుతుంది. అన్ని అవయవాలు సవ్యంగా ఉన్నా.. అవకాశాలను అందిపుచ్చుకోవడం నిత్య పోరాటమే. ఈ పరిస్థితుల్లో దివ్యాంగులు విధి రాతను ఎదురించి నిలుస్తున్నారు. చుట్టూ చీకటి ఉన్నా.. అడుగడుగునా ఆటుపోట్లు ఎదురవుతున్నా.. ఆత్మస్థైర్యం తోడుగా తమను తాము తీర్చిదిద్దుకుంటున్నారు. లోపం మనిషికే కానీ.. మనసుకు కాదని బంగారు భవితకు బాటలు వేసుకుంటున్నారు. సైకిల్ తొక్కడం రాకపోయినా.. మూడు చక్రాల స్కూటర్ ప్రపంచాన్ని వారికి సరికొత్తగా పరిచయం చేసింది. కారులో చిన్న మార్పు.. ఊహలకు రెక్కలు తొడిగింది. ఇప్పుడిక ఆ పనీ, ఈ పనీ అనే తేడా లేకుండా, అన్ని పనులనూ చక్కబెడుతున్న దివ్యాంగుల జీవితం ఎందరికో మార్గదర్శకంగా నిలుస్తోంది. – (సాక్షి, కర్నూలు డెస్క్)

కారునూ నడిపేయొచ్చు

ఇది వరకు ద్విచక్ర వాహనాలను నడిపేందుకు ఆలోచించే దివ్యాంగులు ఇప్పుడు ఎంచక్కా కార్లలోనూ షికారు చేస్తున్నారు. రెండు కాళ్లు లేకపోయినా చిన్న మార్పులతో కారు నడిపేస్తున్నారు. ఈ మార్పు గతంలో మహా నగరాలకే పరిమితమైనా.. ఇప్పుడు సమీప నగరాల్లోనూ, షోరూంలలోనూ అందుబాటులోకి వచ్చింది. కావాల్సిన మార్పు కోసం రూ.15 వేల నుంచి రూ.20 వేల లోపు వెచ్చిస్తే కారు కూడా సిద్ధమవుతోంది. కొన్ని షోరూంలు దివ్యాంగులు కొత్త వాహనం కొనుగోలు చేస్తే ధరలో కొన్ని మినహాయింపులు కూడా కల్పిస్తున్నాయి. అదేవిధంగా ప్రభుత్వం టోల్‌గేట్ల వద్ద కూడా సడలింపులు ఇస్తుండటం విశేషం.

లైసెన్స్ పొందడం ఎలా?

- వికలత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్
- ఆధార్ కార్డు
- నడిపేందుకు అనువైన వాహనం
- దరఖాస్తు వెబ్‌సైట్: https://sarathi.parivahan.gov.in/

అందుబాటులో అనువైన స్కూటీలు



ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలన్నా, బండి ఎక్కడమే తరువాయి రయ్యిమని దూసుకెళ్తున్నారు. ఇంటి పనులు, బయటి వ్యవహారాలే కాదు.. పిల్లలను సరదాగా తిప్పే విషయంలోనూ దివ్యాంగులు స్కూటీని సద్వినియోగం చేసుకుంటున్నారు. పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లడం, కాలేజీల నుంచి ఇంటికి చేర్చడం.. వారి బాగోగుల విషయంలో పాలుపంచుకోవడం, బయటకు తీసుకెళ్లి కోరింది కొనిపెట్టి సరదాలు తీర్చడంలో ఇప్పుడు ఏ లోటూ రానివ్వడం లేదు. అవసరమైతే స్నేహితులకు కూడా లిఫ్ట్ ఇస్తుండటం చూస్తే ఈ వాహనం దివ్యాంగుల జీవితాన్ని ఎంతలా మార్చేసిందో అర్థమవుతుంది.

షోరూంలలోనే వాహనాలు



విభిన్న ప్రతిభావంతుల కోసం కారులో మార్పు చేసిన దృశ్యం

ఐదారేళ్ల క్రితం ద్విచక్ర వాహనం కొనుగోలు చేసినా.. దివ్యాంగులకు అనుగుణంగా మార్పు చేసుకోవడం ఎంతో కష్టతరమైన పని. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి పెద్ద నగరాల్లో మాత్రమే ఈ సదుపాయం ఉండేది. ఈ విషయంలో సరైన అవగాహన లేకపోవడం వల్ల కూడా ఎవరూ ఆ వాహనాల జోలికి వెళ్లలేదు. ఇప్పుడు ఇంటర్నెట్ పుణ్యమా అని ఎలాంటి సమాచారమైనా అరచేతిలో లభిస్తోంది. ఇలా దివ్యాంగులకు అవసరమైన వాహనాలు పట్టణాల్లోనూ అందుబాటులోకి వచ్చేశాయి. ఇప్పుడిక షోరూంలో వాహనం కొనుగోలు చేసే సమయంలోనే చెబితే వాళ్లే అన్ని సౌకర్యాలతో కూడిన వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇందుకు రూ.6 వేల నుంచి రూ.7వేల వరకు అదనంగా ఖర్చవుతోంది.

ఇంటర్ పరీక్షలకు ఫ్లయింగ్ స్క్వాడ్ల నియామకం

కర్నూలు(సెంట్రల్): ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు రెవెన్యూ శాఖలో పనిచేసే నలుగురు డిప్యూటీ తహసీల్దార్లను ఫ్లయింగ్ స్క్వాడ్‌లుగా నియమించినట్లు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎం.రాజేశ్వరి, సైనైజ్, శ్రీదేవి, ఎం.ఓంకార్ ప్రసాద్‌లను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలుగా ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

25న వైఎస్సార్ ఆసరా నిధులు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ ఆసరా 3వ విడత నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 25న విడుదల చేయనున్నారు. అదే రోజు నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నియోజక వర్గాల వారీగా నిర్వహిస్తారు. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులో ఉన్న అప్పు మొత్తాన్ని సర్కారు చెల్లిస్తుంది. జిల్లాలో 38, 211 సంఘాలకు చెందిన 3,96,443 మందికి నాలుగు విడతల్లో మొత్తం రూ.904.11 కోట్లు ఇవ్వాలి. ఇప్పటి వరకు రెండు విడతలు విడుదలు చేసింది. మూడవ విడత నిధులు ఈనెల 25న స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో జమ చేయనున్నట్లు డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): భారత వాయుసేనలో అగ్నివీర్-వాయు ఉద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సెట్కూరు సీఈఓ పీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఇంటర్‌మీడియట్/డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో స్వీకరిస్తారన్నారు. మే 20 తర్వాత ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష ఉంటుందన్నారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ చూడాలని తెలిపారు.

అనంతపురానికి బ్యాలెట్ బాక్సులు

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులు మంగళవారం ఉదయం అనంతపురానికి తరలించారు. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం అనంతపురంలో ఉండడంతో కౌంటింగ్‌ను అక్కడే ఉన్న జేఎన్‌టీయూలో ఏర్పాటు చేశారు. 16వ తేదీన అక్కడ ఓట్ల లెక్కింపు కార్యక్రమం చేపడతారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పత్తికొండ, ఆదోని, కర్నూలులో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూంల నుంచి నేటి ఉదయం సంబంధిత డివిజన్ల ఆర్డీఓలు స్వయంగా తీసుకెళ్లి ఆర్‌ఓ, అనంతపురం కలెక్టర్‌కు మధ్యాహ్నం 12.30 గంటలకు అప్పగించారు.

విజయ డెయిరీ పాల సేకరణ ధరలు పెంపు

- గేదెపాలు లీటరుకు రూ.3, ఆవు పాలు లీటరుకు రూ.4

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పాల ఉత్పత్తిదారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నెల 16 నుంచి పాల సేకరణ ధరను పెంచుతున్నట్లు కర్నూలు మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) మేనేజింగ్ డైరెక్టర్ పరమేశ్వరరెడ్డి తెలిపారు. గేదె పాల ధర కేజీ వెన్నకు రూ.690 నుంచి రూ.720కి పెంచుతున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంటే లీటరుకు రూ.3 వరకు సేకరణ ధర పెరుగుతుందన్నారు. ఆవుపాల ధర ఘన పదార్థాలను బట్టి రూ.295కు పెంచామన్నారు. ఈ ప్రకారం లీటరుకు రూ.4 ప్రకారం సేకరణ ధర పెరుగుతుందని తెలిపారు. మిల్క్ యూనియన్ చేపట్టిన అనేక సాంకేతిక వనరులను పాల ఉత్పత్తిదారులు సద్వినియోగం చేసుకొని నాణ్యమైన పాలను ఉత్పత్తి చేసి అధిక ధర పొందాలని సూచించారు. విజయ డెయిరీ చైర్మన్ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని పాలక వర్గం నిర్ణయం మేరకు పాల సేకరణ ధరలను పెంచినట్లు పేర్కొన్నారు.





కోడుమూరు మండలం గోరంట్లలో గోవింద నామస్మరణ మార్మోగింది. శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. – కోడుమూరు రూరల్

విజయోస్తు..

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో 124 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షలకు హాజరుకానున్న 76,637 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌ఐఓ గురువయ్యశెట్టి

కర్నూలు (సిటీ): ఎన్నో ఆశలతో రేయింబవళ్లు కష్టపడి చదివిన ఇంటర్మీడియెట్ విద్యార్థులకు బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు కేంద్రాల్లో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 283 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 43, ఏపీ మోడల్ స్కూళ్ల కాలేజీలు 34, ఎయిడెడ్ కాలేజీలు 04, ఏపీ సోషల్ వెల్ఫేర్ కాలేజీలు 13, ఏపీ రెసిడెన్షియల్ కాలేజీలు 02, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలు 03, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు 51, ప్రైవేటు కాలేజీలు 113, కార్పొరేట్ కాలేజీలు 18 ఉన్నాయి. వీటిలో మొత్తం 76,637 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి పరీక్షల నిర్వహణకు మొత్తం 124 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో కర్నూలు జిల్లాలో నిర్వహించే 73 కేంద్రాల్లో తొలి సంవత్సర విద్యార్థులు 23,610 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 26,057 మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే నంద్యాల జిల్లాలోని 51 కేంద్రాల్లో మొదటి సంవత్సర పరీక్షలకు 12,178 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 14,792 మంది హాజరుకానున్నారు.

గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు..

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుంటే 8.30 గంటల నుంచి లోపలికి అనుమతిస్తారు. నిర్దేశించిన సమయానికి నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు. ఇప్పటికే ఈ విషయంపై కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్లు అధికారులు తెలిపారు.

కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో పరీక్షలకు రాసేందుకు బెంచీలు కూడా ఉండేవి కాదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం నేలబారు పరీక్షలకు సెలవు చెప్పి ప్రతి కేంద్రంలో బెంచీలను ఏర్పాటు చేసింది. అక్రమాలకు అస్కారం లేకుండా ప్రతి పరీక్ష కేంద్రంలో గది గదికి సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. కేంద్రాల్లో పరీక్షల నిర్వహణను జిల్లా కేంద్రం నుంచి జోనల్, రాష్ట్ర స్థాయి ఇంటర్మీడియెట్ కార్యాలయం వరకు పర్యవేక్షణ చేసేందుకు అధికారులు లైవ్‌స్ట్రీమ్ సదుపాయం కల్పించారు. పరీక్షల సమయానికి పిల్లలు చేరుకునేందుకు రవాణా సదుపాయాలను కూడా కల్పించారు.

17 సమస్యాత్మక కేంద్రాలు

కర్నూలు జిల్లాలో 12, నంద్యాలలో 5 కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. అలాగే ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. హైపర్, పరీక్షల నిర్వహణ కమిటీ, డీవీఈఓ, ఆర్‌ఐఓలు కూడా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు సూచనలు ఇచ్చేందుకు కంట్రోల్ ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇది పని చేస్తుంది. ఏమైనా సమస్యలు ఉంటే 08518–222047 నెంబరుకు సంప్రదించవచ్చు.

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష ప్రారంభ సమయానికి నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించం.

– గురువయ్యశెట్టి, ఆర్‌ఐఓ, కర్నూలు

నులిపురుగులతో అనారోగ్యం



పిల్లలచే మాత్రలు మింగిస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్): కడుపులో నులిపురుగుల కారణంగా పిల్లలు అనారోగ్య సమస్యలకు గురవుతారని, ఆల్బెండజోల్ మాత్రలు వాడితే ఆరోగ్యంగా ఉండొచ్చని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఎ.క్యాంపులోని మున్సిపల్ హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు జిల్లా వ్యాప్తంగా 6లక్షల మందికి పైగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులచే ఈ మాత్రను చప్పరించి నమిలి మింగేటట్లు ఉపాధ్యాయులు చూడాలన్నారు. దీంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఎ.క్యాంపుతో పాటు ఇల్లూరు నగర్, పద్మశ్రీ ప్రైవేటు స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత, వైద్యాధికారి డాక్టర్ నాగసౌమ్య, హెచ్‌ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



మృతి చెందిన రామ్మోహన్‌రెడ్డి (ఫైల్)

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై పాత కందుకూరు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాత కందుకూరు గ్రామ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బంక రామ్మోహన్‌రెడ్డి (40) దుర్మరణం చెందాడు. విధుల్లో భాగంగా బైక్‌పై ఆళ్లగడ్డలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయానికి వెళ్తుండగా పట్టణ సమీపంలోని క్రాస్ రోడ్డు వద్ద కడప వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన రామ్మోహన్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ వెంకట రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఏపీఓ గణేష్‌తో పాటు పలువురు రామ్మోహన్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థిని ఆత్మహత్య

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణం టూ టౌన్ పరిధిలోని సప్తగిరి అపార్టుమెంట్‌లో ఓ విద్యార్థిని సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న యశశ్విని(14) వారం రోజులుగా అనారోగ్యం కారణంతో ఇంటి వద్దే ఉంటుంది. విద్యార్థిని తండ్రి శ్రీరాములు నంద్యాల పట్టణంలో వాణిజ్య శాఖ కార్యాలయంలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి బెడ్‌రూంలోకి ఉరివేసుకోగా గమనించిన తల్లి కేకలు వేయడంతో స్థానికులు బాలికను కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ బలవన్మరణం

తుగ్గలి: గిరిగెట్లలో విమల(38) అనే మహిళ మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. రెండు రోజుల క్రితం ఈమె పుట్టిళ్లు మాచాపురానికి వెళ్లి వచ్చింది. తర్వాత ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఇంట్లో ఉన్న రసాయన ద్రావణాన్ని తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్తుండగా ఆమె ప్రాణాలు విడిచింది. మృతురాలి భర్త రాజప్ప పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విమల ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలికి కూతురు మౌనిక, కుమారుడు బసవరాజు ఉన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తుగ్గలి పోలీసులు తెలిపారు.

బండరాయిపడి యువకుడి మృతి

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని సుంకేశ్వరి క్రాస్‌రోడ్డు వద్ద బండరాయి పడి కౌతాళం మండలం లింగాలదిన్నె గ్రామానికి చెందిన మంజునాథ్ మృత్యువాత పడ్డాడు. మాధవరం ఎస్‌ఐ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఆరేకల్లు గ్రామ శివారులో ఉన్న వరలక్ష్మి గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి లారీలో రాతి స్తంభాలను తీసుకుని వస్తుండగా సుంకేశ్వరి గ్రామ టర్నింగ్ వద్ద లారీ టైర్ పంక్చరైంది. టైరును మార్చేటప్పుడు ప్రమాదవశాత్తూ లారీలో ఉన్న బండరాయి మంజునాథ్‌పై పడటంతో అతను అక్కడికక్కడే మరణించాడు. ఈమేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీని తప్పించబోయి..

గూడూరు రూరల్: సల్కాపురం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాజులదిన్నెకు చెందిన వెంకటేశ్వర్లు(33) అనే వ్యక్తి మృతి చెందాడు. పని నిమిత్తం కర్నూలుకు బైక్‌పై వెళ్తుండగా సల్కాపురం వద్ద లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కిందపడిన వెంకటేశ్వర్లుపై లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంపై కె. నాగలాపురం ఎస్‌ఐ సోమ్లానాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చూపును మింగేస్తోంది!

- ఏటా పెరుగుతున్న గ్లకోమా బాధితులు
- ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో ప్రతి సంవత్సరం 200 మందికి చికిత్స
- ప్రైవేటులోనూ ఏటా వంద మందికి పైగా వైద్యం
- 40 ఏళ్లు పైబడిన వారిలో వ్యాధి లక్షణాలు
- బీపీ, షుగర్, స్టెరాయిడ్ మందుల వాడకంతో సమస్య

అందమైన ప్రపంచాన్ని చూసేందుకు భగవంతుడు ప్రతి జీవికీ రెండు కళ్లు ఇచ్చాడు. అలాంటి కళ్లను నిర్లక్ష్యం చేస్తే జీవితం అంధకారమవుతుంది. అందుకే బాగున్నప్పుడే కళ్లను కాపాడుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు 'వరల్డ్ గ్లకోమా వీక్'గా జిల్లా అంధత్వ నివారణ సంస్థ నిర్వహిస్తోంది. దృష్టిని కబలించే ఈ గ్లకోమా వ్యాధిపై ప్రత్యేక కథనం.



కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల, నంద్యాల కంటి ఆసుపత్రితో పాటు 11 విజన్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో చికిత్స కోసం వచ్చే వారిలో 2 శాతం మంది గ్లకోమాతో బాధపడుతున్నారు. గత ఐదేళ్లలో జిల్లాలో వెయ్యి మందికి పైగా ఈ వ్యాధి బాధితులకు చికిత్స చేశారు. గత యేడాది ఒక్కటే 194 మందికి చికిత్స చేశారు. వీరే గాక ప్రైవేటు క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో చికిత్స పొందే వారి సంఖ్య మరో 400కు పైగా ఉన్నట్లు అంచనా. ఈ మేరకు గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ప్రాంతీయ కంటి వైద్యశాలలో ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నారు. చికిత్స కోసం వచ్చిన వారికి గ్లకోమాపై వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు.

గ్లకోమా అంటే...

మన కంటిలోపల నిత్యమూ ఆక్యుయస్ హ్యూమర్ అనే స్వచ్ఛమైన ద్రవం తయారవుతుంది. ఈ ద్రవం కంటిలోని వివిధ భాగాలను శుభ్రం చేసి పోషణనిస్తుంది. సాధారణంగా ఈ ద్రవం కంటి నుంచి 'అంగిల్' అనే భాగంలో ఉన్న చిన్న చిన్న రంధ్రాల ద్వారా బయటకు వస్తుంది. గ్లకోమా ఉన్న వ్యక్తులలో కంటిలోపలి ద్రవాలు సరిగ్గా బయటకు వెళ్లలేకపోవడంతో కనుగుడ్డులో ద్రవం చేరి కంటి ప్రెషర్ (ఐఓపీ) ఒత్తిడి పెరుగుతుంది. కంటినరం రెటీనా నుంచి మెదడుకు అన్ని సంకేతాలను చేరవేస్తుంది. కంటిలోపల ఉండే కంటినరం భాగాన్ని నేత్రబింబం అంటారు. పెరిగిన ఒత్తిడి నేత్రబింబానికి హాని చేస్తుంది. కొన్నిసార్లు ఒత్తిడి ఎక్కువగా లేకపోయినా గ్లకోమా వచ్చే అవకాశం ఉంది. అందువల్లే గ్లకోమాను గుర్తించేందుకు ఒత్తిడిని పరీక్షించడమే గాక ఇతర అంశాలను కూడా పరిగణించాలి. సాధారణంగా అక్షరపటం చదివించడమే గాకుండా ముఖ్యంగా 40 ఏళ్లు పైబడిన తర్వాత సమగ్ర నేత్ర పరీక్ష తప్పనిసరి.

గ్లకోమాకు అవకాశం

- 40 ఏళ్లు పైబడిన వారికి..
- కుటుంబసభ్యులలో గ్లకోమా ఉన్న వారికి...
- స్టెరాయిడ్ మందులు వాడేవారికి...
- మధుమేహం, అధిక రక్తపోటు ఉన్న వారు, కంటి గాయాలైనవారికి..
- సమీప దృష్టికి మైనస్ అద్దాలు వాడుతున్నవారికి...
- కళ్లలో నొప్పి, ఎర్రదనం, నీరు కారడం
- లైట్ల చుట్టూ రంగుల వలయాలు కనిపించేవారికి...

వ్యాధి రకాలు

ఓపెన్ అంగిల్ గ్లకోమాలో కంటిలో ద్రవాలు ప్రవహించే మార్గాలకు అవరోధాలు ఏర్పడటం ద్వారా ఒత్తిడి (ఐఓపీ) నెమ్మదిగా పెరుగుతుంది. చూపునకు తీవ్ర నష్టం జరిగే వరకు దీని లక్షణాలు స్పష్టంగా కనపడకపోవచ్చు.

కంటిలో ఒత్తిడి

కంట్లో ఒత్తిడి పెరిగినప్పుడు కన్ను పరిమాణం, లోతు పెరుగుతుంది. అంచులు చిన్నవిగా తయారవుతాయి. కన్నులో తవ్వినట్లు ఉండి రంగు పాలుపోయినట్లవుతుంది. రక్తనాళాలు, పక్కకు తొలగించినట్లు, సక్రమంగా లేకుండా విరిగిపోయినట్లు కనిపిస్తాయి.

దృష్టి క్షేత్రంలో మార్పులు

దృష్టి క్షేత్రంలో మార్పులను పెరిమీటర్ ద్వారా కొలుస్తారు. నీటి కాసుల వ్యాధితో దృష్టి క్షేత్రంలో మసక చీకట్లు ఏర్పడతాయి. మొదట చిన్నగా ఉన్న ఈ చీకట్లు కొడవలి ఆకారంలో పెరిగి పెద్దగా మారతాయి. అనంతరం క్రమేణా దృష్టి క్షేత్రం తగ్గుతూ ఒక గొట్టంలో నుంచి చూస్తున్నట్లుగా కనిపిస్తుంది. చివరకు అది కూడా కనిపించక పూర్తి అంధత్వం వస్తుంది.

కంటి ఒత్తిడి పెరగడం

కారు, స్కూటర్, సైకిల్ చక్రాల వలే మన కళ్లు కూడా కొంత ఒత్తిడి ఉంటేనే పనిచేస్తాయి. సాధారణంగా గాలి అధికమై ట్యూబ్ పగులుతుంది, గాలి తక్కువైనా ట్యూబ్ నలిగిపోతుంది. అలాగే కంటి ఒత్తిడి సాధారణ 24 ఎంఎం ఆఫ్ హెచ్‌జీ మించితే గ్లకోమా వస్తుంది.

గ్లకోమాను నిర్లక్ష్యం చేయకూడదు



గ్లకోమాకు శాశ్వత చికిత్స లేదు. అందుకే ఈ వ్యాధిని తొలిదశలోనే గుర్తించడం చాలా ముఖ్యం. కొందరు రోగులలో కేవలం మందులతోనే అదుపు చేయవచ్చు. మరికొందరికి లేజర్ చికిత్స, శస్త్రచికిత్స అవసరం కావచ్చు. వ్యాధి ముదిరిపోతే, సాధారణ చికిత్స పని చేయకపోతే శస్త్రచికిత్స చేయాల్సి రావచ్చు. గ్లకోమాను జీవితాంతం పర్యవేక్షించాల్సి ఉంటుంది.

– డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, సూపరింటెండెంట్, ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల, కర్నూలు

'పది' హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోండి

కర్నూలు సిటీ: వచ్చే నెల 3వ తేదీ నుంచి మొదలు కానున్న పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన నామినల్ రోల్స్, హాల్ టికెట్లను ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ డా.వెంకట రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై విద్యార్థుల వివరాలు సక్రమంగా ఉన్నాయే లేదో చెక్ చేసుకోవాలని, తప్పులు ఉంటే సరి చేయించుకోవాలని డీఈఓ సూచించారు.

స్తంభించిన రిజిస్ట్రేషన్ శాఖ సేవలు

- మధ్యాహ్నం 3 తర్వాత పునరుద్ధరణ

కర్నూలు(సెంట్రల్): ఏపీ స్టేట్ డేటా సెంటర్ సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల్లో సేవలకు అంతరాయం కలిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కూడా సేవలు పునరుద్ధరణకు నోచుకోలేదు. దీంతో ఉద్యోగుల అటెండెన్స్ యాప్, ఇతర వెబ్ ఆధారిత సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్ శాఖలో మధ్యాహ్నం వరకు ఒక్క డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కాలేదు. వరుసగా మూడు రోజుల సెలవుల తరువాత క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు ఇబ్బందులకు లోనయ్యారు. అయితే సుమారు 4 గంటల ప్రాంతంలో సేవలను అందుబాటులోకి తీసుకు రావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

17న పీహెచ్‌డీ స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం)లో ఏపీ రీసెట్ కౌన్సెలింగ్‌లో మిగిలిన పీహెచ్‌డీ సీట్లను ఈ నెల 17న స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బి.ఈశ్వర రెడ్డి తెలిపారు. ఏపీ రీసెట్–2022లో అర్హత సాధించి, సంబంధిత పీజీలో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను తీసుకుని వర్సిటీ పాలక భవనంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

వెంకటాపురం పరిసరాల్లో చిరుత సంచారం

- రెండు కుక్కలపై దాడి
- చిరుత పాద ముద్రలను గుర్తించిన అటవీ శాఖ అధికారులు
- భయాందోళనలో గ్రామస్తులు



చిరుత పాద ముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

డోన్ టౌన్: వెంకటాపురం గ్రామ పరిసరాల్లో చిరుత పులి సంచరిస్తుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో బోయ హనుమంతుకు చెందిన తోటలో కాపలా ఉంచిన రెండు కుక్కలపై సోమవారం రాత్రి చిరుత దాడి చేసింది. ఒక కుక్క కళేబరాన్ని పూర్తిగా తినివేసింది. విషయం తెలుసుకున్న ఆర్డీఓ వెంకటరెడ్డి అటవీశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. ఈ మేరకు డోన్ డివిజన్ ఫారెస్టు అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫారెస్టు సెక్షన్ అధికారి శివశంకర్, ఎఫ్‌బీఓ శివమ్మ తదితరులు గ్రామానికి చేరుకుని తోటలో కుక్క కళేబరాన్ని పరిశీలించారు. సంఘటన స్థలంలో చిరుత పాదముద్రలను నిర్ధారించారు. సమీప కొండల్లో చిరుత సంచారం ఉన్నట్లు తెలియడంతో గ్రామస్తులు పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో జింకల సంచారం ఉండటంతో వాటిని వేటాడేందుకు చిరుతలు సంచరిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. కాగా రైతులు పొలాలకు వెళ్లే సమయంలో గుంపులుగా వెళ్లాలని ఫారెస్టు అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. రాత్రి వేళ పొలాల వద్ద నిద్రించాల్సి వస్తే నాలుగు వైపుల మంటలు వేసుకోవాలన్నారు.

గౌడసత్రం అభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందించిన వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని గౌడ (కౌండిన్య) నిత్యాన్న దాన సత్ర అభివృద్ధి కోసం మంగళవారం బాపట్ల జిల్లా చీరాల గ్రామం పాపతోటకు చెందిన కప్పరపు వెంకటేశ్వరరావు, ఝూన్సీ లక్ష్మీ దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ విరాళం మొత్తాన్ని గౌడసత్రం అధ్యక్షుడు కేతు కుమార్‌గౌడ్, కేతు ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో సత్రం నిర్వాహకులకు ఇచ్చారు. దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రసాదాలు, దేవస్థానం ప్రత్యేక డైరీని బహూకరించి శాలువాతో సత్కరించారు.

ఐదుగురికి బెస్ట్ అవార్డులు



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న పోలీసు సిబ్బంది

కర్నూలు: విధుల పట్ల అంకితభావం, కేసుల దర్యాప్తులో అత్యుత్తమ పనితీరును కనబరచిన ఐదుగురు పోలీసులు (ఫిబ్రవరి నెలకు సంబంధించి) వీక్లీ బెస్ట్ పర్ఫార్మెన్స్‌కు ఎంపికయ్యారు. వీరిలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పీసీ జె.రంగన్న, మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ పీసీ చంద్రబాబు నాయుడు, ఏఆర్ హెడ్ క్వార్టర్ హెచ్‌సీ ఓంకార్‌రెడ్డి, ఆదోని మూడవ పట్టణ పీఎస్ పీసీ పి.వి.కృష్ణయ్య నాయుడు, ఆదోని మూడవ పట్టణ పీఎస్ పీసీ జి.నరేంద్ర ఉన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ వారికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

రైలు నుంచి జారి పడి కృష్ణా జిల్లా వాసి మృతి



మృతి చెందిన దిలీప్ (ఫైల్)

కోసిగి: మండల కేంద్రం కోసిగి రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పడి ప్రాణాలు కోల్పోయాడు. జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు కృష్ణా జిల్లా మొవ్వ మండలం నిడుమోలు గ్రామానికి చెందిన సాలి దిలీప్(35)గా గుర్తించారు. రాయచూర్ నుంచి గుంతకల్లు వరకు టికెట్ తీసుకుని ప్రయాణం చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మృతుడి ప్యాంట్ జేబులో కర్ణాటకకు చెందిన 90 ఎం.ఎల్ మద్యం బాటిళ్లు ఉన్నాయి. ప్రమాదం విషయం తెలియగానే ఆదోని రైల్వే ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ రామస్వామి, ఏఎస్‌ఐ ఈరేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను బట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోసుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇస్లాం మార్గం శాంతి

- జామియా నిజామియా నక్షబంది మొహమ్మద్ అహ్మద్



బహిరంగ సభలో మాట్లాడుతున్న మౌలానా మొహమ్మద్ అహ్మద్

కర్నూలు(రాజ్‌విహార్): సర్వమానవాళి శాంతి మార్గంలో నడవాలని ఇస్లాం సూచించిందని జామియా నిజామియా నక్షబంది, మౌలానా మొహమ్మద్ అహ్మద్ పేర్కొన్నారు. సెంట్రల్ మిలాద్ కమిటీ, అహలే సున్నతుల్ జమాత్ ఆధ్వర్యంలో ఇమాం ఏ ఆజం అబూ హనీఫా రజిఅల్లాహు అన్హు జీవిత చరిత్రపై మంగళవారం రాత్రి స్థానిక పాతబస్తీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా సూచించిన మార్గాలను ఇమాం ఏ ఆజం అబూ హనీఫా ఎంతో వివరించారని, మనుషులు సన్మార్గంలో నడిచేందుకు ఆయన కృషి చేశారన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ కఠోర నియమాలతో ఉపవాసం ఉండాలని సూచించారు. రంజాన్ చివరలో ఫిత్ర, జకాత్ సొమ్మును పేదలకు దానం చేయాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ మిలాద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ, మతపెద్దలు సయ్యద్ షా హుసేన్ పీర్ ఖాద్రి, సయ్యద్ దాదా బాషా ఖాద్రి, సయ్యద్ ముర్తుజావలి ఖాద్రి, సయ్యద్ హుసేన్ బాషా ఖాద్రి, సయ్యద్ అర్షార్ బాషా ఖాద్రి పాల్గొన్నారు.

15 మంది వలంటీర్లకు మెమోలు జారీ

హొళగుంద: ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించడంలో, ప్రభుత్వ పథకాలపై సర్వే చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 15 మంది వలంటీర్లకు ఎంపీడీఓ దాసానాయక్ మెమోలు జారీ చేశారు. మంగళవారం ఆయన గజ్జహళ్లి, వందవాగిలి సచివాలయాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ పలువురు వలంటీర్ల పనితీరు సరిగా లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత గజ్జహళ్లిలో 8 మంది, వందవాగిలిలో ఏడుగురు వలంటీర్లపై మెమోలు జారీ చేశారు.

ఎనిమిది మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు బోగస్

కడప రూరల్: 'కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకానికి సంబంధించి 15 మంది అభ్యర్థులు బోగస్ మార్కుల జాబితాలు పొందినట్లు మా దృష్టికి వచ్చింది. ఆ వివరాలను డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి, డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ వారికి పంపగా.. 8 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు బోగస్‌గా స్పష్టమైంది.' అని కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరి తెలిపారు. బోగస్ మార్కుల జాబితాల కుంభకోణం వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో కలకలం రేపిన విషయమై 'సాక్షి' ఆమె దృష్టికి తీసుకెళ్లగా పైవిధంగా స్పందించారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకానికి సంబంధించి ప్రభుత్వం 2022 నవంబరులో నోటిఫికేషన్ జారీ చేయగా.. జోన్–4 పరిధిలో దాదాపు 12వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. 2023 జనవరిలో స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియను కడపలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించగా. మొత్తం 291 మందికి మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగ అవకాశం కల్పించామన్నారు. అయితే 15 మంది అభ్యర్థులు బోగస్ మార్కుల జాబితాలు పొందినట్లు వెల్లడైందన్నారు. వీరిలో 8 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు బోగస్‌గా తేలాయన్నారు. ఐదుగురు వైద్య విధాన పరిషత్‌లో, ఇద్దరు డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు చేస్తుండగా.. ఒక అభ్యర్థికి ఉద్యోగం రాలేదన్నారు. మిగతా వారి సర్టిఫికెట్ల వివరాలు అందాల్సి ఉందన్నారు. కాగా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీ చేశామని, ఇంకా ఎవరైనా బోగస్ మార్కుల జాబితాలను పొందిన వారు ఉన్నారేమోనని ఆరా తీస్తున్నట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారు ఎవరైనా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య



తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మంగళవారం రాత్రి 9 గంటల సమ యంలో స్థానికులు గుర్తించి తుగ్గలి పోలీసులకు సమాచారం అందించారు. హతుడు దాదాపు 50 ఏళ్లు పైబడి ఉండి నీలం రంగు గళ్ల చొక్కా, క్రీం కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మొహంపై రాయితో మోది దుండగులు అంతమొందించినట్లు తెలుస్తోంది. హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న తుగ్గలి ఏఎస్‌ఐ నరసప్ప, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

గూడూరు: మండల పరిధిలోని సుంకేసుల జలాశయానికి మంగళవారం ఎగువ నుంచి 1,050 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా ఉండగా డ్యాంలో 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేసీ కాల్వకు 505 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంలో ఎస్సీ రైతులకు ప్రోత్సాహం

- రూ.10 వేలు విలువ చేసే కిట్ల అందజేతకు ప్రతిపాదన
- అమ్రిత్ జలధార పథకం ద్వారా 50 శాతం సబ్సిడీ
- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్.శ్రీనివాసకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ శ్రీనివాసకుమార్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఎస్సీ రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించేందుకు డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం) ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్.శ్రీనివాసకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక సంక్షేమభవన్‌లోని తన కార్యాలయంలో కార్పొరేషన్ ఉద్యోగులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17న రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఈడీలతో సమావేశం జరుగుతున్న నేపథ్యంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ పథకాలకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే రూపొందించాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,631 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.10 వేల విలువ చేసే కిట్లను అమ్రిత్ జలధార పథకంలో భాగంగా అందిస్తామన్నారు. యూనిట్ విలువలో 50 శాతం లేదా రూ.50 వేలు మించకుండా సబ్సిడీ ఉంటుందన్నారు. పథకంలో భాగంగా విద్యుత్ మోటార్లు, పంపుసెట్లు, పైప్‌లైన్లు తదితరాలను కూడా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూమి కొనుగోలు పథకం, బ్యాంక్ లింకేజీ రుణాలకు సంబంధించిన(రుణం, సబ్సిడీ) ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ కింద రూ.27.39 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.6.04 కోట్లు మాత్రమే వసూలైందని, లబ్ధిదారులు త్వరితగతిన రుణాలు చెల్లించాలన్నారు. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ కింద రూ.1,24,73,000 రికవరీ చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో ఏఈఓ నాగమణి, పర్యవేక్షకులు శర్మ, ఆలీబాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్ల నాణ్యత పరిశీలన



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ, ఎస్ఈ తదితరులు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ రోడ్ల పనుల నాణ్యతను ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీరు రమేష్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం ఆయనతో పాటు వైఎస్సార్ కడప జిల్లా క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ శివకుమార్ తదితరులు నంద్యాల జిల్లాలోని డోన్ – యాగంటి – రాయలచెరువు రోడ్లు, ప్యాపిలి – బనగానపల్లె, కర్నూలు సబ్ డివిజన్ పరిధిలోని కర్నూలు – సుంకేసుల రోడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత సమయంలోగా ఈ పనులను పూర్తి చేయాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంట ఆర్‌అండ్‌బీ కర్నూలు ఎస్ఈ కే నాగరాజు, ఈఈ బీ సురేష్‌బాబు, నంద్యాల ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారి ఏవీ శ్రీధర్‌రెడ్డి, కర్నూలు, డోన్ డీఈఈలు విజయభారతీ, ప్రసాదరెడ్డి, ఏఈ ఫణిరామ్ తదితరులు ఉన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



కప్పల్‌నగర్‌లో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): వృత్తిలో నైపుణ్యాన్ని పెంచుకొని ప్రజలకు మరిన్ని నాణ్యమైన సేవలు అందించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం స్థానిక కప్పల్ నగర్‌లోని 117 సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ పలు రిజిష్టర్లు, ఉద్యోగుల హాజరుపట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి ప్రతి ఒక్కరికీ అదేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కప్పలనగర్‌లోని అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలకు అందుతున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. మంగళవారం డీ-వార్మింగ్ డేను పురస్కరించుకొని పిల్లలకు కమిషనర్ ఆల్బెండ్‌జోల్ మాత్రలు వేశారు.

సర్వర్ డౌన్‌తో ఆసుపత్రిలో సమస్యలు

కర్నూలు (హాస్పిటల్): రాష్ట్ర వ్యాప్తంగా సమాచార వ్యవస్థకు సంబంధించి సర్వర్ డౌన్ కావడంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం ఉదయం పలు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆసుపత్రిలోని ఓపీ, ఐపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుండటంతో సమస్య ఏర్పడింది. ఓపీ జనరేట్ కాకపోవడంతో కంప్యూటర్ ఆపరేటర్లు కాగితంపై ఓపీ వివరాలు రాసి ఇవ్వాల్సి వచ్చింది. అలాగే వైద్యులు, ఉద్యోగుల హాజరుకు సంబంధించి సైతం ఇబ్బందులు ఏర్పడ్డాయి. బయోమెట్రిక్, ఫేస్ రికగ్నేషన్ యాప్‌లు సైతం పనిచేయలేదు.

రక్తహీనతపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు రక్తహీనత పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఈఈవో నిర్మలమ్మ చెప్పారు. మంగళవారం ఆమె కర్నూలు మండలంలోని భూపాల్‌నగర్‌లో ఉన్న అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులతో మాట్లాడుతూ గర్భవతిగా ఉన్న సమయంలో రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. ఈ మేరకు ఏఎన్ఎంల సహాయంతో అవసరమైన పరీక్షలు నిర్వహించుకుని, రక్తహీనత ఉంటే తప్పనిసరిగా ఐరన్ మాత్రలు వాడాలని సూచించారు. ఆమె వెంట హెల్త్ సూపర్‌వైజర్ సంపత్‌కుమార్, సచివాలయ ఏఎన్ఎం టి.అనిత, లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.

18న తాళ్లపాక అన్నమయ్య వర్ధంతి

కర్నూలు కల్చరల్: తాళ్లపాక అన్నమయ్య 520వ వర్ధంతిని ఈనెల 18వ తేదీ సాయంత్రం 3 గంటలకు సీ క్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ని ర్వాహకులు తెలిపారు. అన్నమాచార్య కీర్తనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, చిన్నారులకు అన్నమాచా ర్యుల వేషధారణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, బలగం, తూ జూఠీ మై మక్కర్, 65
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ష్ : ఆర్‌ఆర్‌ఆర్, సార్, 65, మిస్టర్ కల్యాణ్, నేడు విడుదల, దోచేవారెవరురా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సర్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : తూ జూఠీ మై మక్కర్, క్రీడ్ -3, 65, స్క్రీమ్ – 6, సీఎస్ఐ సనతాన్, ట్యాక్సీ
భరత్ కాంప్లెక్స్ : పులి ది నైన్‌టీన్త్ సెంచరీ, వినరో భాగ్యము విష్ణు కథ
రాజ్ : సీఎస్ఐ సనతాన్
శ్రీరామ : సింహ
విజయ : పులి ది నైన్‌టీన్త్ సెంచరీ

వినియోగదారుడా తెలుసుకో!

- వస్తు సేవల్లో నాణ్యత కొరవడినా, నష్టపోయినా న్యాయం పొందవచ్చు
- బాధితులకు బాసటగా నిలుస్తోన్న జిల్లా వినియోగదారుల కమిషన్
- ఇప్పటి వరకు 8,097 కేసుల పరిష్కారం
- నేడు అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం



కర్నూలు(లీగల్):వస్తు సేవల్లో నాణ్యతా లోపం, కార్పొరేట్ కంపెనీల మోసాలు, ఈ-కామర్స్ సంస్థల మాయాజాలానికి గురయ్యే వినియోగదారుల హక్కుల పరిరక్షణకు వేదికగా నిలుస్తోంది జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్. సత్వర న్యాయం అందిస్తూ వారికి బాసటగా నిలుస్తోంది. డబ్బు వెచ్చించి కొనుగోలు చేసిన వస్తువు లేదా సేవల్లో లోపం ఉంటే నేరుగా కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. రూ.50 లక్షల లోపు వెచ్చించి చేసిన కొనుగోళ్లు, సేవలకు సంబంధించి కేసులు దాఖలు చేసుకోవచ్చు. అలాగే రూ.5 లక్షల లోపు కొనుగోళ్లకు సంబంధించి ఎటువంటి కోర్టు ఫీజు చెల్లించకుండానే న్యాయవాది అవసరం లేకుండానే నేరుగా ఫిర్యాదు దాఖలు చేసుకుని తన కేసును తానే స్వయంగా వాదించుకోవచ్చు. ప్రధానంగా ఈ తరహా ఫిర్యా దులు కమిషన్‌లో దాఖలు చేసుకొని న్యాయం పొందవచ్చు. నేడు అంతర్జాతీయ వినియోగదారుల హ క్కుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేకం కథనం.

ఎటువంటి మోసాలకు ఆశ్రయించవచ్చంటే..
గరిష్ట ధర (ఎంఆర్‌పీ) కన్నా ఎక్కువ వసూలు చేసినా, వస్తువుల్లో స్వచ్ఛత లోపించినా, వైద్యచికిత్సల్లో నిర్లక్ష్యం, తప్పుడు వైద్యం చేసినా, నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించినా, పంటల బీమా పరిహారం మంజూరులో అన్యాయం జరిగినా, బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్, బీమా సేవల్లో లోపమున్నా, ఆర్టీసీ, రైల్వే రవాణా సర్వీసుల్లో అసౌకర్యానికి గురైనా, వాణిజ్య సముదాయాల్లో పార్కింగ్ ఫీజు వసూలు చేసినా, షాపింగ్ మాల్స్‌లో క్యారీ బ్యాగ్‌కు డబ్బు వసూలు చేసినా, సినిమా హాల్స్‌లో నిర్దేశించిన మేరకు సౌకర్యాలు లేకపోయినా, ద్విచక్ర, ఇతర వాహనాల తయారీ, మరమ్మతులో లోపాలున్నా, గ్యాస్ సిలిండర్ బిల్లుకు అదనంగా డబ్బు డిమాండ్ చేసినా, గ్యాస్ సిలిండర్లు పేలి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినా, హోటల్స్‌లో నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందివ్వకపోయినా, రియల్ ఎస్టేట్ సంస్థలు చేపట్టే నిర్మాణాల్లో లోపాలున్నా, జాప్యం జరిగినా, చిట్‌ఫండ్స్ మోసాలు తదితర వాటికి గురైనప్పుడు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చు. ఫిర్యాదు దాఖలు చేయడానికి సంబంధించి సలహాలు, సూచనల కోసం ఉచిత కాల్ సెంటర్ నంబర్ 1915/1800-11-4000ను సంప్రదించవచ్చు.

ఏడాది కాలంలో 262 కేసుల పరిష్కారం :
స్థానిక మున్సిఫ్ కోర్టు ఆవరణలో జిల్లా వినియోగదారుల కమిషన్ కార్యాలయం ఉంది. కమిషన్ ఏర్పాటైనప్పటి నుంచి(గత 25 సంవత్సరాల కాలంలో) గత నెల వరకు 8,329 కేసులు దాఖలు కాగా 8,097 కేసులు పరిష్కారమయ్యాయి. బీమా సంస్థలపై 1,490 కేసులకు గాను 1,338, బ్యాంకింగ్ సంస్థలపై 430 కేసులకు గాను 404 కేసులు పరిష్కారమయ్యాయి. నకిలీ విత్తనాలు, పంటల బీమా అంశాలపై 595 కేసులకు గాను 575, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలపై 628 కేసులకు 624, వస్తువుల్లో నాణ్యత లోపాలు, సేవా లోపాలపై 364 కేసులకు 359 పరిష్కారమయ్యాయి. గత ఏడాది ఫిబ్రవరిలో నూతన అధ్యక్ష, సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ ఏడాది కాలంలో కమిషన్ 262 కేసులు పరిష్కరించగా, 232 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

90 రోజుల్లో పరిష్కారానికి కృషి



కమిషన్‌లో ఫిర్యాదు దాఖలైన 90 రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాన్ని పరిష్కరించి వినియోగదారునికి సత్వర న్యాయం అందిస్తున్నాం. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు వచ్చినా విచారణకు స్వీకరించి ప్రతివాద సంస్థలకు నోటీసులు జారీ చేస్తున్నాం. వినియోగదారులు ప్రత్యక్షంగా విచారణకు హాజరు కాలేకపోతే ఆన్‌లైన్ ద్వారా విచారణ జరిపేందుకు కూడా సిద్ధంగా ఉన్నాం.

– కె.కిషోర్ కుమార్, అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్

పరిశుభ్రమైన ఆహారం, నీటిని అందించాలి



అన్నదాన శిబిరంలో ఆహారాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): శ్రీశైలంకు కాలినడకన వెళ్లే కర్ణాటక భక్తులకు పరిశుభ్రమైన ఆహారం, నీటిని అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. నగర శివారులో నిర్వహిస్తున్న అన్నదాన శిబిరాలను మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడి వైద్యశిబిరాలు, అన్నదాన శిబిరాల్లో పరిశుభ్రత, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీశైలంలో జరిగే ఉగాది ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దీక్షతో 600 నుంచి 800 కి.మీల దూరం పాదయాత్ర చేస్తూ వెళ్తారన్నారు. వీరందరినీ మన రాష్ట్రానికి, జిల్లాకు అతిథులుగా భావించి వివిధ ప్రదేశాల్లో అన్నదాన కార్యక్రమాలు విరివిగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే సమయంలో ఆహారం, నీటితో పాటు పరిసరాల పరిశుభ్రతా ముఖ్యమన్నారు. భక్తుల సౌకర్యార్థం రేమట, సి.బెళగల్, పోలకల్, గూడూరు, కోడుమూరు, పెంచికలపాడు, పెద్దపాడు, కల్లూరు, గార్గేయపురం, గోకులపాడులలో ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

ఎగ్జిబిషన్ మైదానానికి వేలం



ఎగ్జిబిషన్ మైదానానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

- మూడు నెలలకు రూ.కోటి ఆదాయం

కర్నూలు (టౌన్): కర్నూలు నగరపాలక సంస్థకు పాలకవర్గం లేనప్పుడు ఎగ్జిబిషన్ మైదానాన్ని లీజు తీసుకోవాలంటే రూ.15 వేలు చెల్లించాల్సి ఉండేది. అయితే డిమాండ్ ఏరియాలో ఉండటం, వాణిజ్య ప్రాంతం కావడంతో బాడుగను పెంచాల్సి ఉన్న అప్పట్లో రెవెన్యూ అధికారులు పెద్దగా దృష్టి సారించలేదు. పైగా ఓ మాజీ ప్రజాప్రతినిధి పేరుతో కొన్నేళ్లు లీజ్ నడిపించారు. అయితే నగరపాలకకు పాలకవర్గం రావడంతో ఆదాయ వనరులు పెంచే దిశగా ఎగ్జిబిషన్‌ను బహిరంగ వేలం వేసి ఆదాయం రాబట్టాలని కౌన్సిల్ సమావేశంలో తీర్మాణం చేసింది. అందుకు అనుగుణంగా మంగళవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు.

పోటీ పడిన పాటదారులు
ఎగ్జిబిషన్‌కు చెందిన స్థలానికి నిర్వహించిన వేలంలో ఎస్. వెంకటరమణ, జి.సి.రెడ్డప్ప, ఆర్.ఎస్. రఘు ప్రసాద్, ఎ.మల్లికార్జున కిరణ్, ఎస్.నిజాముద్దీన్, ఎస్.నాసిర్‌లు పోటీ పడ్డారు. ప్రతిరోజు ఎగ్జిబిషన్ నిర్వహణకు అత్యధికంగా రోజుకు రూ. 1.11 లక్షలు పాటపాడి జి.సి.రెడ్డప్ప దక్కించుకున్నాడు. 97 రోజుల లీజుకు సంబంధించి రూ.1కోటి 7 లక్షల 7 వేలకు దక్కించుకున్నాడు. టెండర్లలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ ఆఫీసర్ జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామం



కేవీఆర్ కళాశాలలో టగ్-ఆఫ్-వార్‌లో తలపడుతున్న మహిళలు

కర్నూలు (టౌన్): పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామమని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక కేవీఆర్ కళాశాలలో మహిళలకు, యువతులకు టగ్-ఆఫ్-వార్, స్కిప్పింగ్ రోఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం సందర్భంగా రెండు వారాల పాటు మహిళలకు క్రీడా పోటీలు, పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు, ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ నటరాజరావు, కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ భారతి, పీడీలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నేడు క్రీడా పోటీలు
స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో బుధవారం లెమన్ అండ్ స్పూన్, సాక్‌వాక్, త్రోబాల్, స్కిప్పింగ్ రోఫ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

22 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఈ నెల 22వ తేదీ ఉగాది పర్వదినం నుంచి 30వ తేదీ శ్రీరామ నవమి వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7.30 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటల నుంచి శ్రీ లలితా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. భక్తు లు అందరూ పూజల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

17న మునిసిపల్ కార్మికుల ధర్నా

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు తెలిపారు. మంగళవారం ఆయన కేకే భవన్‌లో మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్‌లు, రిస్కు అలవెన్స్‌లు తదితర డిమాండ్లు నెరవేర్చాలని కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు పేర్కొన్నారు.

కర్నూలును న్యాయ రాజధాని చేయాలి

–నవ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రమౌళి

కర్నూలు(సెంట్రల్): వెంటనే కర్నూలును న్యాయ రాజధాని చేయాలని నవ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రమౌళి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. రాయలసీమకు అన్యాయం చేస్తున్న తెలుగుదేశంపార్టీని రద్దు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. విశాఖలో పరిపాలన, అమరావతిలో శాసన రాజధానుల ఏర్పాటుకు నవసమాజ్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

'యూఎన్‌ఏ మిషన్ గ్రూప్'తో ఒప్పందం

కర్నూలు సిటీ: పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు యూఎన్ఏ మిషన్ గ్రూప్ అథారిటీ (ఏపీ, తెలంగాణ విభాగం)తో నగర శివారులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మ్యాను ఫ్యాక్చరింగ్ అండ్ డిజైన్ (ట్రిపుల్‌ఐటీడీఎం- కర్నూలు) ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు, యూఎన్ఏ-2045 విజన్ చీఫ్ ఎక్స్‌పర్ట్ ఎల్.జయరాములు మధ్య ఒప్పంద పత్రాలను మార్చుకున్నట్లు ఆ సంస్థ రిజిస్ట్రార్ గురుమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

31లోపు గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): రీసర్వే రెండవ విడత గ్రామా ల్లో గ్రౌండ్ ట్రూతింగ్ మార్చి 31 లోపు పూర్తి చేయడంతో పాటు ఏప్రిల్ 30 నాటికి సరిహద్దు రాళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం రీసర్వే అంశాలపై అన్ని జిల్లా ల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ కోటేశ్వర రావు సంబంధిత అధికారులతో మాట్లాడుతూ రీసర్వే రెండవ దశ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ ఈనెల 31 నాటికి పూర్తి చేసేలా చూడాలన్నారు. అదేవిధంగా సరిహద్దు రాళ్లకు సంబంధించి మా ర్కింగ్స్ వేసిన వెంటనే సరిహద్దు రాళ్లను ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల వివరాలను వెబ్ ల్యాండ్ 2.0 గడువులోగా అప్లోడ్ పూర్తి చేయా లని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిక్ట్ వెబ్‌సైట్‌లో అర్హుల జాబితా

కర్నూలు(అర్బన్): విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2022 అక్టోబర్ 23న ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా డీఎస్సీ–టైపిస్ట్ అంధులు (వీహెచ్ జనరల్) ఉద్యోగానికి సంబంధించిన అర్హుల, తిరస్కరణ జాబితాను డిస్ట్రిక్ట్ వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగిందని ఆ శాఖ సహాయ సంచాలకులు పి.విజయ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబితాను తమ శాఖ కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచడంతో పాటు వెబ్‌సైట్ www. kurnool. ap. gov. in, www. nandyal. ap. gov లో ఉంచడం జరిగిందన్నారు. ఈ జాబితాకు సంబంధించి ఏవైనా ఆక్షేపణలు ఉంటే ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. అలాగే addwknl@gmail. comలో తగిన ఆధారాలతో తెలియజేయవచ్చన్నారు. అలాగే పోస్టు ద్వారా కానీ తమ వినతులను అందించవచ్చని చెప్పారు. గడువు మీరిన అనంతరం వచ్చే ఆక్షేపణలను పరిగణలోకి తీసుకోవడం జరగదన్నారు.

వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం



డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఈ ఎం.ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లో డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు సమస్యలతో ఇబ్బంది పడరాదనే ఉద్దేశంతో ప్రతి మంగళవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారుల సౌకర్యార్థం యాజమాన్యం 1912 టోల్ ఫ్రీ నంబర్ తీసుకొచ్చిందని, ఈ నంబరుకు ఉచితంగా ఫిర్యాదు చేసినప్పటి నుంచి పరిష్కారం అయ్యే వరకు నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. అంతరాయం లేకుండా సరఫరా అందించడమే ముందున్న లక్ష్యమని, వీటి పట్ల సిబ్బంది లేదా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డయల్ యువర్ ఎస్ఈ ద్వారా వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసుకొని, వాటిని ఆయా ఆపరేషన్స్ ఏఈలు, ఏడీఈల దృష్టికి తీసుకెళ్లి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

బనగానపల్లె మాజీ కమిషనర్ తారకనాథ్ డిస్మిస్

కర్నూలు(లీగల్): అవినీతికి పాల్పడి ఏసీబీకి దొరికిపోయి, న్యాయస్థానంలో దోషిగా నిర్ధారణ కాబడిన బనగానపల్లె నగర పంచాయతీ మాజీ కమిషనర్ ఎ.తారకనాథ్‌ను ప్రభుత్వం సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ మంగళవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మీ ఆదేశాలు జారీ చేశారు. 2014 సంవత్సరం సెప్టెంబర్‌లో భవన నిర్మాణ పనుల అనుమతి కోసం ఒక వ్యక్తి వద్ద నుంచి రూ.5 వేలు లంచం తీసుకుంటూ కర్నూలు రేంజ్ ఏసీబీ పోలీసులకు పట్టుబడ్డాడు. 2014 సెప్టెంబర్ 11న ఆయనను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అవినీతికి పాల్పడినట్లు కర్నూలు ఏసీబీ కోర్టు నిర్ధారించి 2019 జూన్ 25వ తేదీన రెండేళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. కర్నూలు ఏసీబీ కోర్టు తీర్పును సవాలు చేస్తూ తారకనాథ్ రాష్ట్ర హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. అవినీతి కేసులో పట్టుబడి న్యాయస్థానం చేత శిక్షకు గురైనందున ప్రభుత్వం ఆయనను సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలను మాజీ కమిషనర్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం దానిపై రిట్ అప్పీల్‌ను 2021 సంవత్సరంలో రాష్ట్ర హైకోర్టులో దాఖలు చేసింది. ఆ రిట్ అప్పీల్ రాష్ట్ర హైకోర్టు డిస్మిస్ చేయగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు స్పెషల్ లీవ్ పిటిషన్ 1859/2023 రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేయాలని కోరింది. సుప్రీం కోర్టు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ ప్రభుత్వ చర్యలను సమర్థించింది. ఈ మేరకు మాజీ కమిషనర్‌ను ప్రభుత్వ ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తూ ఏపీ మున్సిపల్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. తక్షణమే ఉత్తర్వులు అమలు జరగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వెండి కిరీటం బహూకరణ

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని సుంకులపరమేశ్వరీదేవికి లద్దగిరికి చెందిన భక్తులు మంగళవారం వెండి కిరీటాన్ని బహూకరించాడు. అమ్మవారి మొక్కులో భాగంగా పెద్ద సుంకన్న, శ్రీనివాసులు కలిసి 725 గ్రాముల వెండితో కిరీటాన్ని తయారు చేసి దేవాలయ అధికారులకు అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందించినట్లు ఈఓ దినేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ప్లానింగ్ కార్యదర్శి మృతి



టి.స్ఫూర్తి(ఫైల్)

కర్నూలు (టౌన్): కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 9వ వార్డు 23వ సచివాలయంలో ప్లానింగ్ కార్యదర్శిగా పనిచేస్తున్న టి.స్ఫూర్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఈ సంఘటన సోమవారం ఉదయం హైదరబాద్‌లో జరిగింది. నగరంలోని విష్ణు టౌన్‌షిప్‌లో నివాసం ఉండే ఆమెకు ఈ ఏడాది జనవరి 27వ తేదీన వివాహం అయ్యింది. భర్త హైదరబాద్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం మృతురాలికి పరీక్ష ఉండటంతో అక్కడికి వెళ్లింది. పరీక్ష ముగించుకొని సోమవారం ఉదయం తిరిగి కర్నూలుకు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉదయం భర్తతో కలిసి ద్విచక్రవాహనంలో హైదరాబాద్‌లోని మెట్రో స్టేషన్‌కు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బస్సు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన హైదరబాద్‌కు వెళ్లి కూతురు మృతదేహాన్ని కర్నూలులోని స్వగృహానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు హయ్యత్, రంగస్వామి, తొటి ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

23న బండలాగుడు పోటీలు

పాణ్యం:మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 23వ తేదీన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని న్యూ కేటగిరీ వృషభాలకు పోటీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.విజేతలుగా నిలిచిన వృషభాల యజమానులకు వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున బహుమతులు అందజేస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వృషభాల యజమానులు రూ.600లు ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు.

వైఎస్ జగన్‌తోనే వాల్మీకులకు న్యాయం

- ఎస్టీ రిజర్వేషన్‌పై త్వరలో అసెంబ్లీలో తీర్మాణం చేసే అవకాశం
- మే నెలలో వాల్మీకుల చలో ఢిల్లీ
- వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.సుభాష్ చంద్రబోస్



కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే న్యాయం జరుగుతుందని వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అంశంపై నియమించిన రిటైర్డు ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ కమిషన్ రాష్ట్రమంతా పర్యటించి రూపొందించిన సమగ్రమైన నివేదికను సకాలంలో ముఖ్యమంత్రికి అందించడం సర్వత్రా హర్షణీయమన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుభాష్ మాట్లాడుతూ.. వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్‌పై త్వరలోనే అసెంబ్లీలో తీర్మాణం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించిన అనంతరం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మే నెలలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే వేలాది మందితో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. వాల్మీకుల ఎస్టీ అంశంపై కేంద్రం స్పందించకుంటే కర్నూలు నుంచి ఢిల్లీ పార్లమెంట్ వరకు పాదయాత్ర చేస్తామని, అవసరమైతే జంతర్‌మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడతామన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు ఆన్‌లైన్లో జడ్జిమెంట్

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇన్‌స్పైర్–మనక్ అవార్డు 202-23 విద్యా సంవత్సరానికి ఎంపికైన 255 ప్రాజెక్టులలో 235 ప్రాజెక్టులు అప్‌లోడ్ చేశారు. ఈ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసేందుకు రెండు రోజుల పాటు ఆన్‌లైన్లో జడ్జిమెంట్ చేయనున్నట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ప్రాజెక్టులను ఇండస్ స్కూల్‌లో డీఈఓ పరిశీలించారు. రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసిన ప్రాజెక్టును బుధవారం ప్రకటిస్తారని, అక్కడి ఎంపికైతే జాతీయ స్థాయికి వెళ్తాయన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.